


సిరిసిల్ల రూరల్: అంకుసాపూర్‌లో నేతలతో కలిసి ప్రచారం చేస్తున్న సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీజేపీ నేతలను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న సెస్ చైర్మన్

# అభివృద్ధి ప్రదాతను ఆశీర్వదించండి

- అమాత్యుడికి లక్ష మెజార్టీ అందించాలి
- సిరిసిల్లలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం
- ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించిన నేతలు




ఎల్లారెడ్డిపేట: బొప్పాపూర్‌లో కార్యకర్తలతో మాట్లాడుతున్న కొండూరి రవీందర్‌రావు, బండలింగంపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

ముస్తాబాద్, నవంబర్ 1: సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, మంత్రి రామన్నను ఆశీర్వదించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. బుధవారం తెలంగాణ తల్లి విగ్రహం వద్ద పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ కల్వకుంట్ల గోపాల్‌రావు, జడ్పీటీసీ గుండం నర్సయ్య అభివృద్ధి పనులను ఇంటింటికీ వెళ్లి వివరిస్తూ కేటీఆర్‌కు ఓటు వేయాలని కోరారు. మోయినికుంటలోని సంచార జాతుల కుటుంబాలు మంత్రి కేటీఆర్‌కే ఓటు వేస్తామని తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, మండలాధ్యక్షుడు భూంపెల్లి సురేందర్‌రావు, సహకార సంఘం చైర్మన్ తన్నీరు బాపురావు, నాయకులు సర్వర్ పాషా, సర్పంచ్ గాండ్ల సుమతి, శ్రీనివాసరావు, ఎంపీటీసీలు ఉన్నారు.



వీర్నపల్లి: బాబాయిచెరువుతండాలో ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీపీ భూల, జడ్పీటీసీ కళావతి

### ఓట్ల కోసమే మోసపూరిత హామీలు

వీర్నపల్లి, నవంబర్1: ఓట్ల కోసమే కాంగ్రెస్ మోసపూరిత హామీలు ఇస్తున్నదని ఎంపీపీ మాలోత్ భూల విమర్శించారు. మండలంలోని బాబాయిచెరువు తండాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కేటీఆర్‌కు మద్దతుగా బుధవారం ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో రైతులు కరెంట్ కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ప్రతి కర్షకుడు ఆనందంగా ఉన్నారన్నారు. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓటేయాలని కోరారు. సర్పంచ్ భూక్యా లక్ష్మి, సెస్ డెరెక్టర్ మాడ్గుల మల్లేశం, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, మండల కో ఆప్షన్ సభ్యుడు ఉస్మాన్, బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుగులోత్ సురేశ్ నాయక్, బీఆర్ఎస్ యువజన విభాగం మండలాధ్యక్షుడు సామల్ల దేవరాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు గుగులోత్ కళ, ఎస్సీ యువజన విభాగం మండలాధ్యక్షుడు మల్యాల అశోక్, ఏఎంసీ వైస్ చైర్మన్ తులసీరాం, నేతలు శ్రీరాం నాయక్, రవి, సంతోష్, రఫీ ఉన్నారు.

### భారీ మెజార్టీతో గెలిపించాలి

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 1: సిరిసిల్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి కేటీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సిరిసిల్ల సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పిలుపునిచ్చారు. బుధవారం తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్‌లో ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ముదిరాజ్ సంఘ సభ్యులతో సమావేశమమై మాట్లాడారు. పదేళ్ల ముందు అంకుసాపూర్ ఎట్లన్నుదో.. ఇప్పుడు ఎట్లున్నదో ఆలోచించాలన్నారు. ప్రతి పక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని, 24 గంటల కరెంట్ ఇచ్చే బీఆర్ఎస్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి కేటీఆర్‌కు లక్షకుపైగా మెజార్టీ అందించి, అసెంబ్లీకి పంపుతామన్నారు. ఇందుకు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కర్కబోయిన కుంటయ్య, కోడి అంతయ్య, పడిగెల రాజు, మాజీ సర్పంచ్ అడ్డగట్ల భాస్కర్, భూమారెడ్డి, భాస్కర్ రెడ్డి, కుర్మ రాజయ్య, క్యారం పరశురాములు, ఎల్లం, సంఘ సభ్యులు ఉన్నారు.

### బీఆర్ఎస్‌లోకి బీజేపీ నేతలు

తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్‌కు చెందిన బీజేపీ నేతలు బాలసాని వెంకటేశ్, కోడి బాబు, కోడి లింగం, గౌరవేని రాజు, సందవేని అనిల్ బీఆర్ఎస్‌లో చేరగా సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మంత్రి కేటీఆర్ తోనే అభివృద్ధి సాధ్యమన్న నమ్మకంతోనే పార్టీలో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు.

### మంత్రి కేటీఆర్‌కు భారీ మెజార్టీ

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 1: సిరిసిల్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ చేసిన అభివృద్ధికి ముగ్ధులైన నియోజకవర్గ ప్రజలు పార్టీలు, కులాలు, మతాలకతీతంగా భారీ మెజార్టీతో గెలిపించబోతున్నారని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. బొప్పాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం కొనసాగింది. జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి, ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.




ముస్తాబాద్: పార్టీ మ్యానిఫెస్టోను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, మోయినికుంటలో రామన్నకు మద్దతు తెలుపుతున్న సంచార జాతుల కుటుంబాలు

## కాంగ్రెస్, బీజేపీకి ఓట్లడిగే హక్కు లేదు

సిరిసిల్ల టౌన్, నవంబర్ 1: కాంగ్రెస్, బీజేపీకు ఎన్నికల్లో ఓట్లడిగే హక్కు లేదని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మానాల అరుణ్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014కు ముందు సిరిసిల్ల నియోజకవర్గంలో ఒకే డిగ్రీ కాలేజీ ఉండేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత మంత్రి కేటీఆర్ నాయకత్వంలో సిరిసిల్ల ఎడ్యుకేషన్ హబ్‌గా వర్ధిల్లుతున్నదని తెలిపారు. మెడికల్ కాలేజీ, జేఎన్టీయూ, అగ్రికల్చర్ యూనివర్సిటీ, అగ్రికల్చర్ పాలిటెక్నిక్, గంభీరావుపేటలో కేజీ టూ పీజీ స్కూల్ వంటి ఎన్నో విద్యాసంస్థలను ఏర్పాటు చేశారని వెల్లడించారు. విద్యార్థి లోకానికి మంత్రి కేటీఆర్ వెన్నుదన్నుగా నిలిచారన్నారు. విద్యార్థుల సంక్షేమానికి పాటుపడుతున్న బీఆర్ఎస్‌కే విద్యార్థి లోకం సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. 1200 మంది విద్యార్థుల ప్రాణాలను బలిగొన్న కాంగ్రెస్‌ను , దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు మెడికల్ కాలేజీలు ఇచ్చి తెలంగాణకు మొండి చేయి చూపించిన బీజేపీకి పుట్టగతులుండవని చెప్పారు. రాబోవు ఎన్నికల్లో కేటీఆర్‌కు భారీ మెజార్టీని అందించేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. సమావేశంలో చీమల ప్రశాంత్‌యాదవ్, ఎస్‌కే బాబా, దీపక్, అశ్వక్, శ్రీనాథ్, రాహుల్, సాయి, సాయినాథ్, మోహన్, రణీత్, చాంద్, శ్రావణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు మానాల అరుణ్

## షీ టీం సేవలను సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణ చౌక్, నవంబర్ 1:మహిళలకు, బాలికల సంరక్షణ కోసం తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసి షీ టీం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో షీ టీమ్స్ బృందాలు ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో నిఘా ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అమ్మాయిలు ఎలాంటి వేధింపులకు గురైనా నిర్భయంగా డయల్ 100/87126-56425 నంబర్ ద్వారా షీ టీంకు ఫిర్యాదు చేసి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. గత నెలలో విద్యార్థులను వేధిస్తున్న పోకిరీలపై ఆరు ఎఫ్ఐఆర్లు, మూడు పెట్టీ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 105 అవగాహన కార్యక్రమాల ద్వారా నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఈవ్ టీజింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. మహిళలు, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు భరోసానిస్తూ నిరంతరం రద్దీ ప్రదేశాలు,, విద్యాసంస్థలు, బస్టాండ్ల వద్ద ప్రత్యేక నిఘా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన

తెలంగాణ చౌక్, నవంబర్ 1:సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగహన కలిగి ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ప్రతి నెలా మొదటి బుధవారం సైబర్ జాగృక్త దివస్ అనే వినూత్న కార్యక్రమం ద్వారా విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఆయా పాఠశాలల్లో అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియాను వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు అందించారు. ఉపాధ్యాయులు ఆన్‌లైన్ మోసాలను కట్టడి చేసేలా విద్యార్థులకు వివరించాలని సూచించారు. అధికారులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

**తంగళ్లపల్లిలో..**

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 1: తంగళ్లపల్లిలోని తెలంగాణ గిరిజన గురుకుల మహిళా సంక్షేమ డిగ్రీ కళాశాలలో బుధవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ శ్రీనివాస్ సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలను తీసుకోవాలని కోరారు. అత్యవసరమయితే 100 డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజిని, ఎస్ఐలు శ్రీధర్, వెంకటేశ్వర్లు, విద్యార్థినులు ఉన్నారు.

**ఇల్లంతకుంటలో..**

ఇల్లంతకుంట : నవంబర్ 1 : విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సుధాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులను ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే డయల్ 100కు గాని లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మోతీరాం, హెడ్‌కానిస్టేబుల్ భూమయ్య, కానిస్టేబుళ్లు తిరుపతి, శ్రీనివాస్, జీవన్ పాల్గొన్నారు

## ఇంటింటికీ తిరిగి మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 1: ద్విచక్ర వాహనంపై ఇంటింటికీ తిరుగుతూ మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ తెలిపారు. సిరిసిల్ల నుంచి మద్యం తెచ్చి వెంకటాపూర్‌లో ఇంటింటికీ తిరిగి విక్రయిస్తున్న క్రమంలో వెంకటాపూర్‌కు చెందిన బత్తుల సాయిని ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు. డోర్ డెలివరీకి ఉపయోగించిన ద్విచక్రవాహనం, మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఇక్కడ ఎక్సైజ్ సిబ్బంది కిశోర్‌కుమార్, మల్లేశ్, అమృతారెడ్డి, రాజు, కృష్ణకాంత్, రాజేందర్ ఉన్నారు.

## వాహన చోరీ కేసులో ఒకరికి జైలు

గాంధీ చౌక్, నవంబర్ 1: ద్విచక్రవాహన చోరీ కేసులో నిందితుడికి రెండు నెలల 15 రోజులు జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి మెజిస్ట్రేట్ ప్రవీణ్ బుధవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ తెలిపిన వివరాల మేరకు.. సెప్టెంబర్ 13న సిరిసిల్లకు చెందిన చిలుక రమేశ్, బూర్ల ప్రతాప్, కొడం చందర్ తమ ద్విచక్రవాహనాలు చోరీ జరిగాయని సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మూడు కేసుల్లో దర్యాప్తు చేసి ముస్తాబాద్‌కు చెందిన మీస విష్ణుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం నిందితుడు నేరం చేశానని న్యాయమూర్తి ఎదుట అంగీకరించడంతో న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు

**పుస్తెలతాడు చోరీ కేసులో..**

గాంధీ చౌక్, నవంబర్ 1: వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ చేసిన కేసులో నిందితురాలికి 6 నెలల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి మెజిస్ట్రేట్ ప్రవీణ్ బుధవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ తెలిపిన వివరాల మేరకు.. జూలై 3న ముస్తాబాద్ మండలం పోత్‌గల్ గ్రామానికి చెందిన మర్రిపల్లి నర్సవ్వ పింఛన్ కోసం ముస్తాబాద్‌కు వచ్చింది. బ్యాంక్ బయట ఉండగా గంభీరావుపేటకు చెందిన పాటి సునీత ఆమె మెడలో నుంచి పుస్తెలతాడు లాక్కొని పరారైంది. నర్సవ్వ ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేసి నిందితురాలినని రిమాండ్‌కు తరలించారు. మంగళవారం నిందితురాలు నేరం చేశానని అంగీకరించడంతో న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు